
# ★ పీనాశిపురుగు



.... మల్లిఖార్జున సిద్ధాంతి

★

శివరామయ్యగారు తాలూకాఫీసులో గుమాస్తా. ఆయనకు మంచి రాబడే వుండేది. 15 ఏండ్ల నుంచి సంసారం వెలిగిస్తున్నా అంత నలుసైనా పుట్టలే దిప్పటివరకు. సంపాదన బాగుండటంచేత బ్యాంకు అక్కౌంట్లు లావుగా చేసుకొని మంచి యిల్లు కట్టించి చుట్టూ కూరగాయలచెట్లు, పూల చెట్లు, పెరుగుతోటకూర, చుక్కకూర, బచ్చలాకు, పులిచింతాకులాంటివి యింకా ఏమేమిటో వృక్షజాలాన్ని పెంచాడు. చూడటానికి చక్కగానే వుంది. కూర కాగ ఒక్కకాని పెట్టి కొనవలసిన జరూరు లేకపోయింది శివరామయ్యగారికి. అందుచేతనే ఆయనకు "పీనాశిపురుగు" అని సార్థకనామం ఏర్పడ్డది. ఏమిటో ఏనుగు పోతూంటే కుక్కలు మొరగుతాయి. వీటన్నిటికి శివరామయ్యగారు లెక్కచెయ్యలేదు.

శనివారంనాడుసాయంకాలం చేతిలో కాగితాల కట్ట, ముక్కుమీదికి జారే సులోచనాలు, కొద్దిగా మాసిన తలపాగా, లాంకోటు, సిరామరకల చేతులతో వాడిపోయిన మోహంతో శివరామయ్య, చాలా అలసి అర్ధాంగి ముఖారవిందాన్ని ఎప్పుడు చూచి సంతోషిస్తామా అనుకుంటూ గబగబ యింటికొచ్చాడు.

పెద్దతలుపు మూసుంది. "సుందరం" అన్నాడు.

నిశ్శబ్దం.

"ఏమేవ్, సుందరం"

నిశ్శబ్దం.

"ఇదుగో సుందరం" అంటూ గట్టిగా అరిచి తలుపు తట్టాడు.

"ఎవరు?"

"నేనే"

"నేనుగదుటే సుందరం" ఓసి పిచ్చిదానా అంత భయమెందుకే?"

కిటికీదగ్గరికొచ్చి తొంగిచూచి "మీరా! ఎంతసేపైంది వచ్చి, దొడ్లో పనిచేసేదాని దగ్గరున్నా" అంటూ తలుపుతీసింది. తెల్లటి మిల్లు చీర కట్టుకొని, నొక్కునొక్కుల వెంట్రుకలను బాగా దువ్వి జడవేసి, చుట్టచుట్టుకొని, పచ్చటి ముఖంమీద తళుకు కుంకుమ పెట్టుకొని, అచ్చంగా రతీదేవిలాగ వుంది. శివరామయ్య బలే మురిశాడు సుందరాన్ని చూచి,

"బలే! చాలా చక్కగా వున్నావే సుందరం" అంటూ బుగ్గ పట్టుకున్నాడు.

"అబ్బ! దురూ, ఎప్పుడూ వేళాకోళమేనా? అప్పుడే ఏమైంది, ఇంకా వుంది అలంకారం. ఇదుగో యీ పూలు కాస్త జడచుట్టలో పెడ్తారూ?" అంది.

"సుందరం, పూలు చాలా అందంగా వున్నాయే! ఎవరిచ్చారు?" అన్నాడు శివరామయ్య.

"ఆ! వేడ తీసుకొనిచ్చిందా పూలరంగమ్మ"

అన్నది నెమ్మదిగా. శివరామయ్యగారి గుండెల్లో బండపడ్డది.

"అయితే యివి డబ్బుతిన్నవే నన్నమాట.?" నేనేమిటో వెర్రిబాగులవాణ్ణయి, ఏ అమ్మో, ఏదో శాస్త్ర మంచి ముత్తయిదువుగదానని తెచ్చి యిచ్చిందేమోననుకున్నా, డబ్బు తగలేశావ్, అయ్యయ్యో, ఇట్లా చేస్తే ఎట్లాగే సుందరం" అన్నాడు కోపాశ్చర్య విభ్రమ సంభ్రమాశాభంగ హృదయంతో.

"మరేమనుకున్నారేం ? పూలు దానం చెయ్యటానికి నా కంటె మంచి ముత్తైదువే లేదా యేం యింత పూళ్ళో ? అది నన్నాక్షేపణ హేళన చెయ్యటానికన్న మాట గాకపోతే మరేమిటి చెప్పండి ? ఊరికేనే ఊళ్ళోవాళ్ళందరూ మనింటికొచ్చి పూలిచ్చి పోతారటండీ మరీనూ ?" అని త్రాచుపాములాగా బుస్సుబుస్సుమని పొగలం కక్కుకుంటూ, పూలు ఆ మంచంమీదనే పారేసి గబగబ నడిచింది గదిలోనుంచి.

ఇదంతా చూచేసరికి శివరామయ్యగారి గుండె కాయ ఆగిపోతా ఆగిపోతానంటూ బెదరించ సాగింది. "సుందరం కోప్పడితే రాత్రికి అన్నం లేదు. ఆను లేదు, పక్కాలేదు దీన్నదో విధంగా బతిమాలి మంచిమాటలతో నచ్చచెప్పాలి" అనుకుంటూ లేచాడు శివరామయ్య.

వంటయింట్లో మూల చేరి జడచుట్టను వీకదీసి అల్లికనుగూడ పీకవేయటానికుద్యమిస్తూంది. అది చూచి "సుందరం, సుందరం, అయ్యయ్యో ఏమిటా పని చెప్పు, అంత కోపమా, ఏదో మొగుడు పెళ్ళాం సరసాలు గదుటే. అంతగా కోప్పడితే ఎట్లు ? ఇదుగో ఎప్పటికైనా వయసులోనైనా వయసుమీరినతర్వాతైనా, నీతో నేనూ, నాతో నువ్వు గాకపోతే మరెవరితో సరసాలాడగలం చెప్పు. నీవు అందంగా అలంకరించుకుంటే చూడాలని ఎంత వుబలాటమో నేనేం చెప్పేది సుందరం! అన్నాడు కదల్లేదు.

"ఎందుకూ రెండణాలు బెట్టి పూలు కొనుక్కోటానికూడ గతిలేకపోతే, ఎందుకీ ఆడబతుకు. ఎవడికోసం యీ పూలన్నీ తలకోసమేగా, పెళ్ళాం అలంకరించుకుంటే చూచి ఓర్చలేనివారు మీరు తప్పితే నా కెవ్వరు కనిపించలేదు."

"సుందరం నన్నింతగా బాధిస్తే ఎట్లా చెప్పు. ఏదో పొరపాటున తెలుసా, సరసోక్తులనుకుంటూ వేశాననుకున్నా. అసలు నిన్న చూచేసరికి, రేపు కలవనే సంగతి జ్ఞాపకానికొచ్చేసరికి సంబరం [illegible] పై సరదాలమీదికి పోయిందే నా మనసు. [illegible]మూ, తాపమూ ఎందుకే సుందరం ?"

"ఏడ్చి మొహాంకడుక్కున్నట్టే వుంది సరసం. మీకు బేడకాసు ఖర్చయిందని దిగులు తప్ప మరేమీ లేదు. ఆ నేవి నాలుగు అణాది. ఆ మీద సరసం, ప్రణయం అంటూ కవిత్వాలల్లేది. ఈ మగవాళ్ళందరికి యిదో ఆట" అన్నాది సుందర. కొంచెం ముఖంలో శాంతం వచ్చింది.

జడచుట్టలో పూలు దురుగుతూ, "ఒక్క మాట చెబుతా విను, కోప్పడవద్దు. మనం మాటలు ముడుచుకుంటే ఎవడికి నష్టం. ఇంకో సంగతి, మనంగా డబ్బుపెట్టి ఏ వస్తువైనా కొనుక్కుంటే సర్వసాధారణమే. అందులో విశేష మేమీ లేదు. అది అందరూ చేసేపనే. అట్లా కాకుంటా ఎవరైనా మనకో తృణమో పణమో యిస్తే, ఆ యిచ్చిన వాళ్ళకు, పుణ్యమూ పురుషార్థం వుంటుంది. మనకు


బహుమానము రు.500

ఒక అద్భుతమయిన సృష్టి

మాజిక్ ఉంగరం

మాజిక్, మెస్మరిజమ్ ప్రభావమువల్ల తయారుచేయబడిన ఈ ఉంగరము దుష్టగ్రహబాధ లేకుండచేయుటలో అసమానమైనది. దీనిని ధరించినవారికి సమస్త మనోవాంఛలు చేకూరును; ప్రణయము, వ్యాజ్యము, ఆరోగ్యము, ఐశ్వర్యము మొదలగు విషయములలో విజయము నిచ్చును. ఒక్కరాత్రి ధరించిన ఈ మేజిక్ రింగు అద్భుతశక్తి తెలియును.

ఉంగరము ఒకింటికి రు. 2/-

మూడుఉంగరములు రు. 5/-

ప్యాకింగు, తపాలఖర్చులు అదనము.

మహాకాళి ఆశ్రమం,

నం. 247, కాన్పూరు.

**MAHAKALI ASHRAM**

No. 247, KANPUR.

అదే వుంటుందిలే, అంతే కాదు, యింకో సంగతి వింటున్నావా! సుందరం. ఎవరైనా ఆ వస్తు వెక్కడిదమ్మా అని అడిగితే అదుగో ఫలానివాళ్లు తెచ్చిచ్చారని చెబితే, అప్పుడు మనకెంత గౌరవం, పరువు ప్రతిష్ట వుంటాయో ఆలోచించు. లాభం సంగతి అటుంచులే, నీవే ఆలోచించి చెప్పు" అన్నాడు శివరామయ్య.

పూలు జడలో పెట్టడమయింది. ఆవిడ కొంచెం సర్దుకుందికూడా.

"ఏమిటోనమ్మా నా కొక్క సంగతి అక్కర్లేదు బాబూ. ఈ వుపన్యాసాలు నా కెందుకు మీరేమైనా చెప్పండి యిన్నాళ్ళ నేను రెండణాలు దండగ చేశానని మీరు నా మీద యింతగా దూకుతున్నారు ఏం చేస్తాం?"

"పోనీ అట్లనే అనుకో. నా తప్పు నేనే ఒప్పుకుంటున్నాగా, కావాలంటే మన దొడ్లో వుండే పూలు పెట్టుకోవచ్చుగదా, వాటికి ప్రత్యేకంగా ఖర్చెందుకు, సుందరం. మన జీతం, మన వుద్యోగం ఎట్లాంటివో నీకూ తెలుసు. ఏదో వుపాయంగా అనవసర ఖర్చులు చెయ్యకుండా యీ కాలంలో సంసారం దాటెయ్యాలి. దాన్నే తెలివంటారు. అప్పుడు బాగా సంసారం చేసేదానివని నిన్నంటారు. నన్ను అంతేలే.'

"ఎందుకో యీ జాగ్రత్తలన్నీ. ఇదంతా మూటగట్టి ఎవడి కివ్వాలని? ఆ ఆశకూడ ఆరిపోతూంది. ఇదంతా సరేగాని, గుమాస్తాలందరూ ఆఫీసులకు వెళ్ళకుండా మానేసే జీతాలెక్కువ చేస్తారన్నారుగా మీరు ఇంకేం?" అంటూ దొడ్లో కెళ్ళింది సుందరం.

తెల్లవారింది ఆదివారమవడంవల్ల కొంచెం సావకాశంగానే లేచింది సుందరం, అది కనిపెట్టి శివరామయ్యగారుకూడా లేచారు. లేచి చీర అవి సర్దుకుంటూండగా కొంగుకొసన చిన్నమూట కనిపించింది సుందరానికి. ఏమిటో చిత్రంగా వుందే? రాత్రి తను అలాంటి మూటేమీ కట్టలేదే. అఖరుకు ఎక్కడపాడైనా కాదు, ఏమిటో చూడాలని మూట విప్పుతూంటే శివరామయ్యగారి హృదయం జల్లుజల్లుమంటూంది. మూటవిప్పి చూచేసరికి వాడిపోయిన నాలుగైదు చేమంతిపూలు, రోజాపూలు, ఒకబేడ కాసు కనిపించాయి. ఆశ్చర్యపడుతూ భర్తవైపు చూచింది. వారు నేనేగదా యింతపని చేశానన్నట్లు నవ్వారు సగర్వంగా.

"ఆహా! మనదే యీ పని. దీనికి అర్థమేమిటో కాస్త చెప్పండి?"

"ఏమిటో నువ్వే ఆలోచించు తెలుస్తుంది."

"ఏమిటో బాబూ నాకేమీ తెలీదు. అంతటి తెలివి నాకుంటేగా! మీరే చెప్పండి."

"రాత్రి పదిగంటలప్పుడు, ఆ పూలు అవి నీ చీరకొంగున ముడివేశా. తెల్లవారేసరికి పూలేమో వాడిపోయ్యాయిగాని డబ్బేమైనా చెడిపోయిందేమో చూడు. డబ్బెప్పటికీ చెడిపోదు, అది శాశ్వతం. డబ్బునందుకనే వృథా చెయ్యకూడదు సుందరం. ఈ చిన్నవాటిమీదికి దృష్టిపోతే డబ్బు నాశనమే. నీకీ విషయం బోధించటానికే నేనీపని చేసింది"

"అబ్బ!! ఏమి తెలివండి! ఏమి తెలివి. ఆహా! మీ తెలివి మీకే తగు, అందుకనేగా వూళ్ళోవాళ్ళందరు పీనాశిపురుగనటం" అంటూ సుందరం నవ్వుకుంటూ, మెరుపులా మాయమైంది.

---

# రవీంద్రుని సూక్తులు

• భమిడిపాటి వెంకటరమణ •

చూడకూడనిదాన్ని చూడవలెనని యిష్టంలేని దానిని పొద్దస్తమానం చూడడం అవుతూంది.

అయోగ్యులకోసమని దేవుడు సృజించినది ప్రేమ ఒక్కటే!

పెద్దసంసారాల్లో పుట్టిన తరంగాలు అతి పెద్దవిగనుక ఒక్కలయ తప్పడంతో సరిపోదు పాటే సాగదు.

ఉన్న బలమంతా ఉపయోగించి నేను తెచ్చుకోగలిగినదే నాది.

సూర్యాస్తమయం అప్పుడు ఆకాశాన్నుండే అందం పోస్తు అందం క్రమక్రమంగా ఆక్రమించుకుని వచ్చే మృత్యువుకి వున్నది. జీవనం అఖ్ఖర్లేదు అన్నవాళ్ళకి మనస్సు కరిగిపోతుంది అందం చూస్తే.

గుల్ల నిజమైన వస్తువేగాని పిల్లకోర్కె గాలీ వెలుతురూ.

స్త్రీలు భగవంతుని మనస్సులో పుట్టారు; మొగవాళ్ళను సుత్తిదెబ్బలు కొట్టి తయారు చేశాడు దేవుడు.